# స్టాంపుల కొరత

లేవని సమాధానమిస్తున్న కామారెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు

- ఇండెంట్ పెట్టినా స్టాక్ రావడం లేదంటున్న సిబ్బంది


కామారెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

కామారెడ్డి అర్బన్: ఒక రోజు కాదు...రెండు రోజులు కాదు ఏకంగా నెల రోజుల నుంచి కామారెడ్డి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో స్టాంపుల కొరత ఉన్నా పట్టించుకున్న నాథుడు లేరని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రం అయినా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ఇంకా ఏర్పాటు కాలేదు. గతంలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పట్టణానికి 5 కిలోమీటర్ల దూరంలోని పాతరాజంపేటకు తరలించారు. స్టాంపుల కోసం ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించి కార్యాలయానికి వెళ్లిన వారికి స్టాక్ లేదని సిబ్బంది బదులిస్తున్నారు. ఆన్‌లైన్‌లో చెల్లింపు చేశామని అంటే.. రాష్ట్రంలో ఎక్కడైనా తీసుకోవచ్చని, 20 కిలోమీటర్ల దూరంలోని దోమకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉన్నాయని అక్కడికి వెళ్లమని ఉచిత సలహా ఇస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. జిల్లా కేంద్రంలో స్టాంపుల కొరతపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. జిల్లాలోని ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద, దోమకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనూ నో స్టాక్ బోర్డు పెట్టినట్లు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నెల రోజులవుతోంది

స్టాంపుల కోసం ఇండెంట్ పెట్టి నెల రోజులవుతోంది. స్టాక్ పంపడం లేదు. స్టాంపుల ప్రింటింగ్ నిలిపివేసినట్టు చెబుతున్నారు. ఫ్రాంకింగ్ మిషన్‌లు వస్తాయంటున్నారు. ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేసిన వాటికి రాష్ట్రంలో ఎక్కడైనా తీసుకోవచ్చు. ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేసుకోవచ్చు.

–ప్రవీణ్ కుమార్, ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్, కామారెడ్డి

## క్లుప్తంగా

### ఆర్య వైశ్య ఫెడరేషన్ యూత్ అధ్యక్షుడిగా చిదుర వెంకటేష్



బాన్సువాడ: ఇంటర్నేషనల్ ఆర్య వైశ్య ఫెడరేషన్ బాన్సువాడ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడిగా చిదుర వెంకటేష్‌ను నియమించారు. సోమవారం హైదరాబాద్‌లోని నారాయణగూడ సెంట్రల్ ఆఫీసులో నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గంజి రాజమౌళి గుప్తా, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తాల చేతుల మీదుగా చిదుర వెంకటేష్‌కు నియమాక పత్రం అందజేశారు. బాన్సువాడకు చెందిన చిదుర వెంకటేష్ మాట్లాడుతూ..ఫెడరేషన్ అభివృద్ధికి తన వంత కృషి చేస్తానని అన్నారు.

### బీఎస్పీ కామారెడ్డి అభ్యర్థిగా సురేష్‌గౌడ్



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి నియోజకవర్గం నుంచి సీఎం కేసీఆర్‌పై పోటీ చేయడానికి బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థిగా మద్నూర్‌కు చెందిన ఉడుతవార్ సురేష్ గౌడ్ పోటీ చేస్తారని పార్టీ జిల్లా అధ్యక్షుడు బెట్టంకి బాల్‌రాజు తెలిపారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సురేష్‌గౌడ్‌కు టికెట్ ఖరారు చేశారని బాల్‌రాజు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో దళిత బహుజనులను చైతన్యం చేస్తూ, బీఎస్పీ హామీలను ప్రజల్లోకి తీసుకుపోతామని జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజు అన్నారు.

### ఆత్మీయ సమ్మేళనం వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బార్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాస్, శ్రీకాంత్, సాయిబాబాలు అన్నారు. సోమవారం ఎల్లారెడ్డిలో న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. నవంబర్ 4న హైద్రాబాద్‌లోని జలవిహార్‌లో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఉంటుందని దీనిని విజయవంతం చేయాలని వారు కోరారు.

### గుండెపోటుతో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మృతి



భిక్కనూరు: కాచాపూర్ గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కుర్ర రాములు(58) గుండెపోటుతో సోమవారం మృతిచెందాడు. ఆయన నిరుపేద కావడంతో రాములు మరణ వార్త తెలుసుకున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అంత్యక్రియల కోసం రూ.10వేలను స్థానిక నేతల ద్వారా ఆయన కుటుంబానికి పంపించారు. రాములు మృతదేహం వద్ద ఎంపీపీ గాలిరెడ్డి, మాజీ ఎంపీపీ తొగరి సుదర్శన్, డీసీసీబీ డైరెక్టర్ కిష్టగౌడ్, సర్పంచ్ సులోచన తదితరులు నివాళులర్పించారు.

### పోలీసుల వాహనాల తనిఖీ



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని పిట్లం–బాన్సువాడ ప్రధాన రహదారిపై సోమవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెడ్‌కానిస్టేబుల్ సాయాగౌడ్ మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాల తనిఖీలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### హనుమాన్ ఆలయంలో బీజేపీ అభ్యర్థి పూజలు



మద్నూర్(జుక్కల్): సలాబత్‌పూర్‌లోని హనుమాన్ ఆలయంలో సోమవారం జుక్కల్ బీజేపీ అభ్యర్థి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించి నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించాలని ఆమె కోరుతూ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మండల కేంద్రంలోని ఆయా కాలనీలలో బీజేపీ నాయకులు కమలం పువ్వుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు.

## వెన్నంటి ఉండి గెలిపించుకుంటాం


మదన్ మోహన్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ నేతలు


కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మదన్ మోహన్

రాజంపేట: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకులు ఎల్లారెడ్డి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంపికైన మదన్ మోహన్ రావును మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల్లో రాజంపేట మండల కేంద్రంలోని యువకులం మొత్తం కలిసి మదన్ మోహన్ గారిని గెలిపించుకుంటామన్నారు. మదన్ మోహన్ చేసిన సేవలు ప్రజల గుండెల్లో ఎప్పుడూ చిరస్థాయిగా గుర్తుంటాయని తెలిపారు. ఎస్సీ సెయూఐ మండల అధ్యక్షుడు షేక్ జమీల్, రహమత్, హర్షవర్ధన్, తదితరులున్నారు.

**కాంగ్రెస్‌లో చేరిక**

రాజంపేట: మండలానికి చెందిన బీఆర్ఎస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బన్సీలాల్, గుడితండాకు చెందిన ఉప సర్పంచ్ దేవిసింగ్‌లు సోమవారం మదన్ మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మదన్ మోహన్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వారు పేర్కొన్నారు.

### ఓటమి భయంతోనే కార్యకర్తలతో ప్రమాణం



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఓటమి భయంతోనే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మదన్‌మోహన్‌రావు కార్యకర్తలతో ఓటు వేస్తామని ప్రమాణం చేయిస్తున్నారని మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ విమర్శించారు. సోమవారం ఎల్లారెడ్డిలో ఆయన మాట్లాడుతూ.. మదన్‌మోహన్‌కు ఓటమి భయం పట్టుకుందన్నారు. స్థానికుడు కాని మదన్‌మోహన్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. అభివృద్ధిని చూసి ప్రజలు మరోమారు సురేందర్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తారని అన్నారు. డీసీసీబీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, జలంధర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ నర్సింలు, తదితరులున్నారు.

### బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

మాచారెడ్డి: మండల కేంద్రంతో పాటు సోమారంపేట, రోడ్డు బండ తండాల నుంచి మొత్తం 330 మంది సోమవారం ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎంపీపీ నర్సింగరావు, గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానం పలికారు. వైస్ ఎంపీపీ నర్సింహారెడ్డి, జెడ్పీటీసీ రామ్ రెడ్డి, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు బాల్ చంద్రం తదితరులున్నారు.


బీఆర్ఎస్‌లో చేరుతున్న మహిళా కార్యకర్తలు

### రోగులకు మెరుగైన వైద్యం అందించాలి



మద్నూర్(జుక్కల్): ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స కోసం వచ్చే రోగులకు వైద్యులు, సిబ్బంది మెరుగైన వైద్య సేవలు అందించాలని టీబీ ప్రొగ్రాం అధికారి డాక్టర్ మోహన్‌బాబు సూచించారు. డోంగ్లీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం టీబీ ప్రొగ్రాం అధికారి డాక్టర్ మోహన్ బాబు సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రికి వచ్చిన రోగులతో వైద్య సేవలపై ఆయన ఆరా తీశారు. ఆస్పత్రిలో వైద్యులు సమయపాలన పాటించాలని ఆయన సూచించారు.

## ‘ఏడు వేల మందితో కేటీఆర్ సభ నిర్వహిస్తాం’

భిక్కనూరు: మండల కేంద్రంలో పాల్గొనే కేటీఆర్ సభను ఏడు వేల మందితో నిర్వహిస్తామని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్సీ షేరి సుభాష్‌రెడ్డిలు తెలిపారు. వారు సోమవారం భిక్కనూరు మండల కేంద్రంలో బుధవారం కేటీఆర్ పాల్గొనే సభ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎన్ని కుయుక్తులు పన్నినా కామారెడ్డిలో సీఎం కేసీఆర్ రికార్డు మెజార్టీతో గెలుపొందడం తథ్యమన్నారు. ఎంపీపీ గాలిరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, సర్పంచ్ తున్కి వేణు, తదితరులు పాల్గొన్నారు.


సభ స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ

### పోలింగ్ విధులను సక్రమంగా నిర్వర్తించాలి



ఎల్లారెడ్డి: పీవో, ఏపీవోలు ఎన్నికల విధుల సమయంలో సక్రమంగా విధులను నిర్వర్తించాలని మాస్టర్ ట్రైనీలు అన్నారు. సోమవారం ఎల్లారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలింగ్ కేంద్రానికి ఈవీఎంలతో వెళ్లే నాటి నుంచి పోలింగ్ పూర్తయిన తర్వాత ఈవీఎంలను అప్పగించేంత వరకు చేయాల్సిన విధుల గురించి వివరించారు. మాస్టర్ ట్రైనీలు వెంకటేశం, శ్రీకాంత్ తదితరులున్నారు.

## ఇళ్లపై ఉన్న విద్యుత్ వైర్లను తొలగించాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఇళ్లపై ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలను తొలగించాలని కోరుతూ రాఘవపల్లి గ్రామస్తులు సోమవారం ట్రాన్స్‌కో సబ్ ఇంజినీర్ నర్సింలుకు వినతిపత్రం అందించారు. మండలంలోని రాఘవపల్లిలో 20 కుటుంబాల ఇళ్లపై నుంచి 11 కేవీ విద్యుత్ తీగ ఉండటంతో ఇబ్బందులు కలుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటిపై కప్పు కోవడానికి సైతం కష్టమవుతున్నదని, గతంలో తమ గ్రామానికి చెందిన వ్యక్తి ఇంటి నిర్మాణం చేసే క్రమంలో విద్యుత్ వైర్లు తగిలి ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు.

పలుమార్లు అధికారులకు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదని అన్నారు. విద్యుత్ తీగలను తొలగించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

## కేటీఆర్ వస్తే ఒరిగేదేమీ లేదు

మాచారెడ్డి: మంత్రి కేటీఆర్ పర్యటన వల్ల ఒరిగేదేమీ లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గణేశ్ నాయక్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి షబ్బీర్ అలీ కామారెడ్డిలోనే పోటీ చేస్తారని చెప్పారు. సీఎం కేసీఆర్‌ను కామారెడ్డిలో ఓడిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 6 గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని స్పష్టంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓబీసీ అధ్యక్షుడు రవిగౌడ్, నాయకులు కొమురయ్య, స్వామినాయక్, రాకేశ్, భూపతి, నరేష్, తదితరులున్నారు.


మాచారెడ్డిలో మాట్లాడుతున్న గణేశ్ నాయక్

### గ్లోబర్ టీచర్ అవార్డుకు ఎంపిక



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు పి.ప్రవీణ్‌కుమార్, ఏకేఎస్ ఫౌండేషన్ గ్లోబల్ టీచర్ అవార్డుకు ఎంపికయ్యారు. నవంబర్ 4న న్యూఢిల్లీలో నిర్వహించే కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్ ఈ అవార్డును అందుకోనున్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ప్రవీణ్ కుమార్ ఎంపిక కావడం పట్ల పలువురు అభినందించారు.

## ముందస్తు అరెస్టులు


పోలీస్ స్టేషన్‌లో అరెస్టయిన నాయకులు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): బాన్సువాడ సభకు సీఎం కేసీఆర్ వస్తున్న సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు, నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో వడ్ల సతీష్, హన్మండ్లు, యూసుఫ్, తదితరులు ఉన్నారు.

## పెద్ద ఎత్తున తరలిన శ్రేణులు


నస్రుల్లాబాద్ నుంచి వస్తున్న ప్రజలు

బాన్సువాడ రూరల్/నస్రుల్లాబాద్/మద్నూర్: సోమవారం బాన్సువాడలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు బాన్సువాడ, నస్రుల్లాబాద్, మద్నూర్ మండలాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. గులాబీ కండువాలు, క్యాప్‌లు ధరించి ప్రత్యేక ఆకర్షణగా బస్సుల్లో బయలుదేరారు.

## సీఎం గెలవాలని ప్రార్థనలు

దోమకొండ: సీఎం కేసీఆర్ కామారెడ్డిలో భారీ మెజార్టీతో గెలవాలని కోరుకుంటూ సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రార్థనలు చేశారు. ఎన్నికల ప్రచారం నిర్వహించి ఆలయం వద్ద ప్రార్థనలు చేశారు. ఎంపీటీసీ మాజీ సభ్యులు నల్లపు శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆశంశెట్టి పోశయ్య, తదితరులు పాల్గొన్నారు.



## కొనుగోలు కేంద్రాలు ప్రారంభం


పాల్వంచలో ప్రారంభిస్తున్న అధికారులు


పిట్లంలో .. తహసీల్దార్ రామ్మోహన్ రావు

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఆరేపల్లి, భవానిపేట, పాల్వంచ, ఎలుపుగొండ, ఫరీదుపేట, సింగరాయపల్లి గ్రామాల్లో సోమవారం అధికారులు సింగిల్ విండో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాచారెడ్డి వ్యవసాయాధికారి రమ్యశ్రీ మాట్లాడారు. మాచారెడ్డి, పాల్వంచ తహసీల్దార్లు శ్వేత, సాయులు ఉన్నారు.

**పిట్లం పరిధిలో..**

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో సహకార సంఘం ఆధ్వర్యంలో వరి, మొక్కజొన్న, సోయ పంటల కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ రామ్మోహన్ రావు ప్రారంభించారు. సంఘ కార్యదర్శి సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

**మద్నూర్ పరిధిలో..**

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం మద్నూర్ వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సోయాబీన్, మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. సొసైటీ కార్యదర్శి బాబురావ్, ఏఈవో ప్రియాంక, మార్కెట్ కమిటీ కార్యదర్శి విఠల్, తదితరులు పాల్గొన్నారు.

**నాగిరెడ్డిపేట పరిధిలో..**

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మాల్తుమ్మెద సొసైటీ పరిధిలో గల పోచారం, వదల్పర్తి, గోపాల్‌పేట్, నాగిరెడ్డిపేట, చీనూర్, వాడి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. మాల్తుమ్మెద సొసైటీ సీఈవో పవన్‌కుమార్, ఏఈవో భబిత తదితరులు పాల్గొన్నారు.

### ‘ప్రజాప్రతినిధులు ప్రారంభించొద్దు’

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎన్నికల కోడ్ దృష్ట్యా కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మన్లు కానీ పాలకవర్గ సభ్యులు కానీ ప్రారంభించరాదని సొసైటీల మానిటరింగ్ అధికారి రాధిక అన్నారు. సోమవారం సబ్దల్‌పూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఎల్లారెడ్డి సొసైటీలో పాలక వర్గంతో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆదాయవ్యయాల వివరాలను ఆమె పరిశీలించారు. కార్యదర్శి విశ్వనాథం, సొసైటీ చైర్మన్ నర్సింలు, వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్ ఉన్నారు.


మద్నూర్‌లో..


మాల్తుమ్మెదలో ..

### మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రం సమీపంలోని కట్టు కాల్వ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి ఎమ్మెల్యే జాజాల సురేందర్ సహకరించి మానవత్వం చాటుకున్నారు. వివరాలు.. ఎల్లారెడ్డి మండలం వెల్లుట్లకు చెందిన హన్మాండ్లు తన మనవరాలు అంకితను తాడ్వాయి మండల కేంద్రంలోని హాస్టల్‌కు పంపడానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో లింగంపేట మండల కేంద్రం సమీపంలోని కట్టుకాల్వ వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయింది. దాంతో హన్మండ్లు ఆయన మనవరాలు అంకితకు గాయాలయ్యాయి. అదే సమయంలో కామారెడ్డి వైపు వెళ్తున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్ తన కాన్వాయిని నిలిపి క్షతగాత్రులను తన వాహనంలో ఆస్పత్రికి తరలించారు. వైద్యుడితో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. వారికి అయిన ఖర్చులు తానే చెల్లిస్తానని వైద్యుడికి చెప్పారు. ఎమ్మెల్యే చేసిన సాయానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.


క్షతగాత్రులకు సహాయం అందజేస్తున్న జాజాల

## ప్రమాదకరంగా తాడ్వాయి-కన్‌కల్ రోడ్డు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి నుంచి కన్‌కల్‌కు వెళ్లే రోడ్డును బాగుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. నాలుగు సంవత్సరాల క్రితం వేసిన రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో రోడ్డు గుంతలమయంగా మారింది. రోడ్డు మధ్యలో నిర్మించిన కల్వర్టు పూర్తిగా కొట్టుకుపోయింది. కల్వర్టుపై ఉన్న మొరం పోయి క్రిందిపైపులు బయటకు తేలాయి. ఈ రోడ్డుపై రైతులు తమ పంట పొలాలకు తరచుగా వెళ్తుంటారు. పొలం నుంచి పంటధాన్యాన్ని ఇంటికి తెచ్చుకోవడానికి ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని అధ్వాన్నంగా తయారైన కల్వర్టు, రోడ్డును బాగు చేయించాలని కోరుతున్నారు.


మొరం పోయి ప్రమాదకరంగా ఉన్న పైపులు

## కారు గుర్తుకు మరోమారు ఓటేసి గెలిపించండి


ఎల్లారెడ్డిలో ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ తదితరులు,


రాజంపేటలో..

జిల్లాలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. సోమవారం కార్యకర్తలు, నేతలు ఇంటింటి తిరుగుతూ కారు గుర్తుకు ఓటేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి మరోమారు సీఎం కేసీఆర్‌ను గెలిపించాలని ఓటర్లకు కోరారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్మొద్దన్నారు. – సాక్షి నెట్‌వర్క్


భిక్కనూరు మండలం జంగంపల్లిలో..


కామారెడ్డి పట్టణంలోని 27వ వార్డులో ..